బావిలో పడి బాలుడి మృతి



మల్లేష్(ఫైల్)

గట్టు, జూలై 6 : బావిలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహులు కుమారుడు మల్లేష్(12) తన తాత పొలం దగ్గర గొర్రెలు కాస్తుండగా ఆయనకు ఇంటి నుంచి అన్నం తీసుకుపోయాడు. తాత గొర్రెలు మేపుతుండగా బాలుడు దగ్గర్లోని బావిలో నీరు తాగడానికి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మేఘారెడ్డి వర్సెస్ చిన్నారెడ్డి

- వనపర్తిలో రెండు వర్గాలుగా చీలిన కాంగ్రెస్ పార్టీ
- ఇరువర్గాల బహిరంగ విమర్శలు.. తరచూ ప్రొటోకాల్ సమస్యలు
- ఎమ్మెల్యే లేకుండానే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- కర్నెతండాలో కలెక్టర్ వద్దన్నా బీఆర్ఎస్ ఎంపీపీతో పీహెచ్‌సీ ప్రారంభం
- ఎవరైనా అడిగితే కేబినెట్ హోదా ఉన్నదని బదులిస్తున్న చిన్నారెడ్డి వర్గం
- జిల్లా అధికారులకు తలనొప్పిగా మారిన అధికార పార్టీ నాయకుల వైఖరి



కర్నె తండా పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి(ఫైల్)

మహబూబ్‌నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనపర్తి జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా రాజకీయాలు మేఘారెడ్డి వర్సెస్ చిన్నారెడ్డిగా మారిపోయాయి. ఇరువర్గాల మధ్య నెల కొన్న వైషమ్యాలు తారస్థాయికి చేరాయి. ప్రతిపక్ష పార్టీ నుంచి గెలిచిన నాయకుల కోసం పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో నీతులు వల్లె వేసిన నాయకులే ప్రస్తుతం నీతిని తప్పుతున్నారని ఇరువర్గాల నాయకులు వాదిస్తున్నారు. వనపర్తి నియోజకవర్గంలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున మొదట ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి టికెట్ ఇచ్చారు. అప్పటికే పార్టీలో చేరి, టికెట్ ఆశిస్తున్న మేఘారెడ్డి.. అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేయడంతోపాటు నియోజకవర్గంలో బలప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. దాంతో చిన్నారెడ్డి టికెట్‌ను మేఘారెడ్డికి కేటాయించారు. ఇక అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీ ఇరు వర్గాలుగా విడిపోయింది. ఎన్నికల్లో పోటీ చేసిన మేఘారెడ్డి.. అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డిని ఓడించి భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆ సమయంలో చిన్నారెడ్డి వర్గం నాయకులు కొందరు కాంగ్రెస్‌కు కాకుండా బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారని ఆరోపణలు వచ్చాయి. వాటిని మేఘారెడ్డి వర్గం ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, తనను గురువుగా చెప్పుకునే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో చిన్నారెడ్డికి కేబినెట్ హోదాలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి బాధ్యతలు అప్పగించారు. దాంతో అప్పటికే దావాణలంలా వ్యాపించిన అంతర్గత విభేదాలు బయటకు రావడం ప్రారంభమయ్యాయి. అంతకముందు విజయోత్సవ సభలు, ర్యాలీలు, ఎన్నికల ప్రచారం తదితర కార్యక్రమాల్లో మేఘారెడ్డితో కలిసి చిన్నారెడ్డి ఎక్కువగా ప్రచారం చేయలేదని విమర్శలు కూడా ఉన్నాయి. ఇరువురికి పదవులు ఉంటే కలిసి పని చేసుకుంటారని ప్రజలు భావించగా.. ప్రస్తుతం ఒక వర్గం చేస్తున్న పనులు పార్టీలో ఇంకా అసమ్మతిని తయారు చేస్తున్నాయని చర్చ సాగుతోంది.

కలిసి పనిచేయకపోతే అభాసుపాలు..


చిన్నారెడ్డి ఏఐసీసీ కార్యదర్శిగా ఉండటం, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పని చేసిన అనుభవం ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా మేఘారెడ్డి నియోజకవర్గంలో, చిన్నారెడ్డి మంత్రిగా ఉంటారని కూడా ప్రకటించారు. ముందు నుంచి ఇద్దరు నాయకులు ఆ దిశగా ఆలోచించారు. అయితే తాజాగా జరుగుతున్న పరిణామాలు పార్టీని అభాసుపాలు చేస్తున్నాయి. చిన్నారెడ్డి కేబినెట్ హోదాలో నియోజకవర్గంలో పర్యటిస్తుండటం.. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే లేకుండా చేస్తుండటంతో ప్రొటోకాల్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముందు నుంచి అనుకున్నట్లు కలిసి పనిచేస్తే ఏ సమస్యా ఉండేది కాదు. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. ఇటీవల శ్రీరంగాపూర్‌లో ఎమ్మెల్యే, ఎంపీపీ లేకుండా చిన్నారెడ్డి జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. మహిళా సమాఖ్య, పోస్టు ఆఫీసు, అంగన్‌వాడీ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేయడంతో వివాదం చెలరేగింది. అదేరోజు మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే జనరల్ బాడీ సమావేశాన్ని ముందుగానే నిర్వహించారు. అలాగే సూగూరులో బ్రిడ్జిని కూడా ప్రారంభించారు. ఖిల్లాఘనపురం మండలం కర్నె తండాలో నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవం వివాదస్పదమైంది. అక్కడ బీఆర్ఎస్ నుంచి ఎంపీపీగా ఉన్న కృష్ణానాయక్ పదవీకాలం ముగుస్తుండటంతో తన పేరు ఉండదనే కారణంతో ముందస్తుగా పీహెచ్‌సీ ప్రారంభానికి పూనుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి రావాలని క్యాంపు ఆఫీసులో లెటర్ అందజేశారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం అధికారులు ఏర్పాట్లు చేసి.. ఆహ్వానాలు ఇవ్వాలి. కానీ ఇక్కడ ఎంపీపీ నుంచి ఆహ్వానం వెళ్లింది. ఎమ్మెల్యే రాకపోవడంతో చిన్నారెడ్డిని సంప్రదించారు. ఆయన ఎంపీపీని దామోదర రాజనర్సింహ వద్దకు తీసుకెళ్లి.. ఆహ్వానించారు. తనకు వీలు పడదని, ఓఎస్డీ ద్వారా ప్రారంభించుకోవాలని దామోదర రాజనర్సింహ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడ విద్యుత్, నీటి వసతి, డాక్టర్ల కేటాయింపు వైద్య ఆరోగ్యశాఖకు హ్యాండోవర్ కాకపోవడంతో ప్రారంభోత్సవానికి అధికారులు నో చెప్పారు. అయినప్పటికీ.. చిన్నారెడ్డి వెళ్లి బీఆర్ఎస్ ఎంపీపీ కృష్ణానాయక్‌తో పీహెచ్‌సీని ప్రారంభోత్సవం చేయించారు. అదే సమయంలో.. కిరాయిదారులు వస్తుంటారు.. పోతుంటారు.. అని చిన్నారెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. 2016లో ఇదే కృష్ణానాయక్ వర్గం చిన్నారెడ్డిపై దాడి చేసి గాయపర్చినా.. కేవలం ఎమ్మెల్యేతో విభేదించడానికి ఎంపీపీకి మద్దతుగా చిన్నారెడ్డి ప్రారంభోత్సవానికి వెళ్లారని ఎమ్మెల్యే వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు.

ఒక నియోజకవర్గం.. రెండు పవర్ సెంటర్లు..

సాధారణంగా నియోజకవర్గంలో ప్రజల నుంచి ఎన్నుకోబడిన ఎమ్మెల్యే చుట్టూ అధికారం కేంద్రీకృతమై ఉండాలి. కానీ ప్రస్తుతం వనపర్తి నియోజకవర్గంలో రెండు పవర్ సెంటర్లు ఉన్నాయి. దీని వల్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయారు. దాంతో ప్రజలకు కూడా కొంత గందరగోళం ఏర్పడిందని చెప్పొచ్చు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి చిన్నారెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో కూడా అప్పటి ఎమ్మెల్యే చిన్నారెడ్డికి, నిరంజన్‌రెడ్డికి మధ్య ప్రొటోకాల్ విషయంలో వివాదాలు నెలకొన్నాయి. ఆ సమయంలో చిన్నారెడ్డి.. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడికి వనపర్తిలో ఏం పని? రాష్ట్రం మొత్తానికి పనిచేయాలి కదా? కేవలం వనపర్తిలో గెలవడం కోసమే అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఆ వీడియోను మేఘారెడ్డి వర్గం సోషల్ మీడియాలో వైరల్ చేస్తోంది. అప్పుడు తప్పని చెప్పిన చిన్నారెడ్డి.. ఇప్పుడు తాను చేస్తున్నదేంటని ప్రశ్నిస్తోంది. అలాగే రెండు వర్గాలుగా విడిపోయిన నాయకులు.. ఇతర పార్టీల నుంచి చేరుతున్నవారి విషయంలో ఏకాభిప్రాయంగా ఉండటం లేదు. ఎమ్మెల్యే చేర్చుకోవద్దంటే.. చిన్నారెడ్డి పార్టీలో చేర్చుకోవడం, చిన్నారెడ్డి చేర్చుకోవద్దంటే ఎమ్మెల్యే చేర్చుకోవడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం చిన్నారెడ్డికి వ్యతిరేకంగా మేఘారెడ్డి వర్గం నాయకులు, మేఘారెడ్డికి వ్యతిరేకంగా చిన్నారెడ్డి వర్గం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతుండటం గమనార్హం. చిన్నారెడ్డి కేబినెట్ హోదాలో మిగతా నియోజకవర్గాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేస్తున్నారో.. ఇక్కడా అలాంటి కార్యక్రమాలే చేయాలని మేఘారెడ్డి వర్గం నాయకులు అంటున్నారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కూడా దొడ్డిదారిన వచ్చారని పరోక్షంగా ఎమ్మెల్యేను ఉద్దేశించి ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం ఈ రెండు పవర్ సెంటర్ల మధ్య నెలకొన్న వివాదాలు అధికారులకు తలనొప్పిగా మారగా.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం చేకూరే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వివాదాలపై అటు చిన్నారెడ్డి, ఇటు మేఘారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

ఒకే ఒక్కరు

- ఉమ్మడి జిల్లాలో 59 జూనియర్ కళాశాలలకు గాను ఒక్కరే పీడీ
- ఇంటర్‌లో క్రీడలకు దక్కని ప్రోత్సాహం
- ప్రతిభ ఉన్నా వెలుగులోకి రాలేకపోతున్న క్రీడాకారులు
- 2023-24లో జాతీయ స్థాయికి ఎదిగింది 18 మంది మాత్రమే..



మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 6: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలంటే కనీస మౌలిక వసతులు అవసరం. క్రీడా మైదానాలు, సానపెట్టే గురువులు, పరికరాలు ఉండాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వరకు పాఠశాలల్లో పీఈటీలు, కొన్ని ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఉండటంతో అండర్-17 వరకు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారు. ఇంటర్‌కు వచ్చే సరికి సరైన ప్రోత్సాహం లేక ముందుకు వెళ్లలేక పోతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇంటర్ కళాశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు(పీడీ)లు లేకపోవడమే అని చెప్పొచ్చు. ఉమ్మడి జిల్లాలో 59 జూనియర్ కళాశాలలు ఉండగా, కేవలం ఒకే ఒక్క పీడీ ఉండటం గమనార్హం. దాంతో ఎంతో మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా వెలుగులోకి రాలేక పోతున్నారు. ఉన్న వనరులు, సీనియర్ క్రీడాకారుల ప్రోత్సాహంతో కొందరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్లగల్గుతున్నారే తప్ప.. ఫలితాలు మాత్రం ఆశించిన మేర కనిపించడం లేదు.

వెలుగులోకిరాని క్రీడాకారులు

జూనియర్ కళాశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేక క్రీడాకారులు వెలుగులోకి రాలేకపోతున్నారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ జరుగుతుందని అందరూ ఆశించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా పీడీ పోస్టులు భర్తీ చేయలేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 400 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, అందులో 10 మంది పీడీలు మాత్రమే ఉన్నారు. గతేడాది కేవలం 94 పీడీ పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా అన్ని కళాశాలల్లో పీడీ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.



రాష్ట్ర స్థాయి అండర్-19 హ్యాండ్‌బాల్ విజేతగా నిలిచిన మహబూబ్‌నగర్ బాలుర జట్టు(ఫైల్)

ప్రైవేట్ కళాశాలలో ప్రోత్సాహం కరువు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 100కుపైగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉండగా, దేనికీ వ్యాయామ ఉపాధ్యాయులు లేరని తెలుస్తోంది. కేవలం పరీక్షల్లో ర్యాంకులు ఎలా సాధించాలనే అంశంపైనే కళాశాలల యాజమాన్యాలు దృష్టి పెడుతున్నాయి. కొన్ని కళాశాలల్లో మాత్రమే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రైవేట్ కళాశాలల్లోనూ వ్యాయామ ఉపాధ్యాయులను నియమించేలా ఇంటర్ బోర్డు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

కష్టంగా అండర్ 19 ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూనియర్ కళాశాలలు 59 ఉండగా, చాలా కళాశాలలకు మైదానాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అవి మహబూబ్‌నగర్‌లో 15 ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో 16, వనపర్తిలో 12, జోగుళాంబ గద్వాలలో ఎనిమిది, నారాయణపేటలో ఎనిమిది ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల బాలికల జూనియర్ కళాశాలలో మాత్రమే ఒకే ఒక్క ఫిజికల్ డైరెక్టర్ ఉన్నారు. దీంతో అండర్-19 ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ కష్టంగా మారింది. పాఠశాల స్థాయిలో పీఈటీల సహకరంతో జట్ల ఎంపికలు, రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ చేపడుతున్నారు. 2023-24లో ఉమ్మడి జిల్లాలో మూడు రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించగా, వాటిని పీఈటీల సహకారంతోనే ఏర్పాటు ఏర్పాటరు. గద్వాలలో రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ బాలుర టోర్నీ, మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి అండర్-19 హ్యాండ్ బాల్, అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలు నిర్వహించారు. గత సంవత్సరం జాతీయ స్థాయికి ఉమ్మడి జిల్లా నుంచి కేవలం 18 మంది క్రీడాకారులు మాత్రమే వెళ్లగలిగారు. క్రికెట్‌లో ఐదు మంది, హ్యాండ్‌బాల్‌లో ఆరుగురు, బాస్కెట్ బాల్‌లో ఏడు మంది జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు.



పెద్దకొత్తపల్లి మండలం బాచారంలో పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన స్కూల్

బడికి బీటలు

- నాగర్‌కర్నూల్ జిల్లాలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలు
- పగుళ్లు వచ్చి, పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- మౌలిక వసతులకూ నోచుకోని స్కూల్స్

ఆంధ్రజ్యోతి పరిశీలన

బడి భయపెడుతోంది. బీటలు వారిన గోడలు, శిథిలావస్థకు చేరిన భవనాలు ఎప్పుడేం జరుగుతుందోనని గుబులు రేపుతున్నాయి. అసలే వానాకాలం కావడంతో ఆ పాఠశాలలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు వణికిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ పిల్లలను స్కూల్స్‌కు పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మొత్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నది.

- నాగర్‌కర్నూల్, (ఆంధ్రజ్యోతి)

నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో 560 ప్రాథమిక పాఠశాలలు, 565 ప్రాథమికోన్నత పాఠశాలలు, 131 జడ్పీహెచ్ఎస్‌లు ఉన్నాయి. మొత్తం 44,830 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శిథిలావస్థకు చేరిన పాఠశాలలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. పలు పాఠశాలల్లో మూత్రశాలలు లేవు. ఉన్నచోట నిర్వహణ సరిగా లేదు. నీళ్లు కూడా లేని పరిస్థితుల్లో ఆడపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిల భవనాలు

తెలకపల్లి మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. రాకొండ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో టాయిలెట్లు కూడా లేవు. బల్మూరు మండలం బిల్లకల్‌లో పాఠశాల భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. వంగూరు మండలం కోనేటిపురంలో పాఠశాల పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. చారకొండ మండలంలోని కొమ్మలగుడిసెల పాఠశాలల పరిస్థితీ ఇందుకు భిన్నంగా లేదు. బిజినేపల్లి మండలంలో దాదాపు 20 పాఠశాలల్లో పైకప్పు పెచ్చులు ఊడింది. వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనూ అదే పరిస్థితినెలకొంది. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ లేక అధ్వాన్నంగా ఉన్నాయి. కొల్లాపూర్ మండలంలోని నార్లపూర్ ప్రాథమిక పాఠశాల అధ్వాన్న దశకు చేరుకుంది. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. పాఠశాల ప్రహరీ కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరి.. కూలడానికి సిద్ధంగా మారడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు.

గుర్తిస్తున్నాం

నాగర్‌కర్నూల్ జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, మౌలిక వసతులు లేని స్కూల్స్‌ను గుర్తిస్తున్నాం. యుద్ధప్రాతిపదికన మండల విద్యాశాఖ అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

- గోవిందరాజులు, డీఈవో



తెలకపల్లి మండలం రాకొండలో నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు



అమ్రాబాద్ మండలం మన్ననూర్ అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పగుళ్లు ఇచ్చిన పాఠశాల గది




అమ్రాబాద్ మండలం ప్రశాంత్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలో కూలిపోయిన పాఠశాల గోడ

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ పాలమూరు ఎమ్మెల్యేల డిమాండ్



మద్దిమడుగు ఆలయంలో ఎమ్మెల్యేలను సన్మానించిన ఆలయ ఈవో, అధికారులు

అచ్చంపేట, జూలై 6 : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, కశిరెడ్డి నారాయణ రెడ్డి, రాజేష్ రెడ్డి, వంశీకృష్ణతో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. నల్లమలలో రెండు రోజుల ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా చివరి రోజు శనివారం మద్దిమడుగు ఆంజనేయ స్వామిని, రాయలగండి లక్ష్మీచెన్న కేశవ స్వామిని వారు దర్శించుకున్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిరంజన్‌రెడ్డి అవినీతిపై వనపర్తి రాజీవ్ చౌక్ వద్ద చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. వనపర్తి నియోజకవర్గ ప్రజలు ఛీకొట్టినా మాజీ మంత్రికి బుద్ధి రాలేదని, పదేళ్లుగా వనపర్తిలో 140 ఎకరాలు కబ్జాలు చేసి రూ.వేల కోట్ల అక్రమాస్తులు సంపాదించుకున్నారన్నారు. మీ బాస్ కూతురిలా నీవూ జైలుకు వెళతావని హెచ్చరించారు. మంత్రి అయిన తర్వాత నీవు విదేశాలకు ఎన్నిసార్లు వెళ్లావు, ఎందుకు వెళ్లావో పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. నీ దత్తపుత్రుడి ఖాతాలను పరిశీలిస్తే నీ అవినీతి భాగోతం బయటపడుతుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై నిరంజన్ రెడ్డికి, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మాట్లాడే హక్కులేదన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కేటీదొడ్డి, జూలై 6: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం కుచినెర్ల గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. కుచినెర్ల శివారులో హైవే రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్ఐ వెళ్లి పరిశీలించారు. మృతుడి గురించి విచారించగా యర్సన్‌దొడ్డి గ్రామానికి చెందిన యాదవ పెద్ద తిమ్మప్ప(57)గా గుర్తించారు. తన తండ్రి తాగుడుకు బానిసయ్యాడని తిమ్మప్ప కొడుకు యాదవ కృష్ణ తెలిపారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు.

గద్వాల అభివృద్ధికి సీఎం హామీ

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

గద్వాల, జూలై 6: గద్వాల నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గద్వాలకు చేరుకుని, క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గద్వాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం గురించి, గట్టు ఎత్తిపోతల పథకం వేగవంతం గురించి సీఎంతో మాట్లాడానని వివరించారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన ర్యాలంపాడు రిజర్వాయర్ కట్టను పటిష్ఠ పరిచి, నాలుగు టీఎంసీల నీళ్లను నిల్వచేసే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ నెల తొమ్మిదిన మహబూబ్‌నగర్‌లో నిర్వహించే సమీక్ష సమావేశానికి సీఎం హాజరుకానున్నారని, ఆ సమయంలో ఈ ప్రాంత సమస్యలు, అభివృద్ధిపై పూర్తి నివేదికను తయారు చేసి ఇస్తానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో గద్వాలను అభివృద్ధిని చేస్తానని వివరించారు. కాంగ్రెస్‌లో చేరి, గద్వాలకు వచ్చిన ఎమ్మెల్యేను పలువురు పూలమాల, శాలువాతో సత్కరించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

క్రీడల్లో రాజకీయాలకు తావివ్వొద్దు

- ఫ్లెక్సీలో నా ఫొటో తొలగిస్తారా.. నేను కట్టించిన స్టేడియం కూల్చివేస్తారా?
- జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేశాను అభివృద్ధికి సహకరిస్తాం
- మాజీ మంత్రి వీ.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూలై 6: క్రీడల్లో రాజకీయాలకు తావివ్వొద్దని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి 10వ అండర్-19 బాల,బాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియం గతంలో ఎలా ఉండేది, నేను క్రీడా శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టిన తరవాత ఎలా ఉందో పరిశీలించాలన్నారు. ఇండోర్‌స్టేడియం, ఆర్చీ, ప్రధాన స్టేడియం మైదానం ఆధునీకరణ, వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేశామన్నారు. జాతీయస్థాయి టోర్నీ నిర్వహించుకొనేలా ఇండోర్‌స్టేడియం అందుబాటులోకి తెచ్చామన్నారు. క్రీడల్లో రాజకీయాలకు చోటు ఉండొద్దని సూచించారు. ఇక్కడ వచ్చిన వెంటనే సార్ మీ బ్యానర్ తీసి వేశారని అడుగుతున్నారన్నారు. ఎమ్మెల్యే పీఏ ఫోన్ చేసి ఫొటో తొలగించాలని స్టేడియం అధికారులకు చెప్పారని మా వాళ్లు చెబుతున్నారన్నారు. ఫ్లెక్సీల్లో నా ఫొటో తొలగిస్తారే కానీ, ప్రజల గుండెల్లో ఎప్పుడు ఉంటానన్నారు. క్రీడల్లో రాజకీయాలు ఉండవని, అందుకే ప్రతీ ఒక్కరిని పిలుస్తారన్నారు. మీరు అభివృద్ధి చేయండి స్వాగతిస్తామని, ప్రతీ విషయంలో రాజకీయాలు చేయొద్దని మాజీ మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆశీర్వాదించారు, పని చే యండి పూర్తి సహకారం ఉంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు మహబూబ్‌నగర్ అతిథ్యం ఇవ్వాలని ఆకాక్షించారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మా ట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాభివృద్ధికి కృషి చేశారని, ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఇండోర్‌స్టేడియం నిర్మించారని గుర్తు చేశారు. క్రీడాభివృద్ధి తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, రవికుమార్ కార్యనిర్వహక కార్యదర్శి సాదత్‌ఖాన్, ఉపాధ్యక్షులు విజయ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చైతన్యరెడ్డి, రాంకుమార్, ట్రెజరర్ రాజశేఖర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



షటిల్ బ్యాడ్మింటన్‌లో పతకాలు పొందిన విజేతలు



మిక్స్‌డ్ డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన అన్నా చెల్లెల్లు ఎం.అజయ్‌కార్తీక్, ఎం.కీర్తికి ట్రోఫీ అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ముగిసిన షటిల్‌బ్యాడ్మింటన్ టోర్నీ..

టోర్నీలోని ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. బాలుర ఫైనల్ సింగిల్స్‌లో ఎం.అజయ్ కార్తీక్ (జనగామ), అశ్రిత్ వలిశెట్టి(మెదక్)పై, బాలికల సింగిల్స్ ఫైనల్‌లో ప్రశంస బొనము(ఖమ్మం), శ్రేష్టా రెడ్డి (హైదరాబాద్)పై గెలిచి చాంపియన్‌గా నిలిచారు. డబుల్స్‌లో బాలికల విభాగంలో అలీశఖాన్, శేష్టారెడ్డిలు సమీక్ష రెడ్డి, పూజితనీలకంఠిలపై, బాలురలో నవనీత్, వెంకట్‌మౌనిష్‌లు, అశ్రిత్ వలిశెట్టి, జయన్షరెడ్డిలపై గెలిచి విజేతగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎం.అజయ్ కార్తీక్, ఎం.కీర్తిలు, వర్షిత్‌శ్రీసాయి, అలీశఖాన్‌పై గెలిచి అన్నాచెల్లెల్లు ఎం.అజయ్‌కార్తీక్, ఎం.కీర్తిలు మిక్స్‌డ్ డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచారు.

బడి బస్సు భద్రమేనా..?

- లోపిస్తున్న భద్రత
- అనుమతులు తక్కువ.. తిరిగే వాహనాలు ఎక్కువ
- అధికారుల అవగాహన కార్యక్రమాలను పెడచెవిన పెడుతున్న స్కూల్ యాజమాన్యాలు

అయిజ, జూలై 6: బడి బస్సుల్లో భద్రత లోపిస్తోంది. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులపై చూపే శ్రద్ధ పిల్లలను తరలించే వాహనాలపై చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తల్లిదండ్రులు సైతం పాఠశాల బస్సు, వ్యాను, ఆటో వస్తుందని చూస్తున్నారే తప్ప వాటిల్లో ఏ మాత్రం భద్రత ఉందో పరిశీలించటం లేదని పలువురు పెదవివిరుస్తున్నారు. ఫలితంగా అనుకోని బస్సు ప్రమాదాలు జరిగినప్పుడు చిన్నారుల బంగారు భవిష్యత్ అంధకారంగా మారుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 239 విద్యా సంస్థల బస్సులు ఉంటే అందులో 213 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా బస్సులు ఏవని ప్రశ్నిస్తే పాత సామన్ల తుక్కు కింద వేస్తామని నమ్మబలుకుతూ వాటినే సర్వీసులగా వాడుతూ పిల్లలను చేరవేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠ శాలల కళాశాలల యజమాన్యాలు తమ వాహనాలకు సార్థ్యపు పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్‌నెస్ ధ్రువపత్రం, పర్మిట్, బీమా, పొల్యూషన్, లెసెన్స్ 60 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, అనుభవజ్ఞుడై డ్రైవర్‌ను పెట్టుకోవాలి. ప్రతీ బస్సులో మరొక వ్యక్తి సహాయకుడిగా ఉండాలి. బస్సులో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పేందుకై వీలుగా ఫైర్ ప్రొటెక్షన్ సిలిండర్ ఉండాలి. బస్సుల్లోని కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసల పైపులను ఏర్పాటు చేయాలి, విద్యార్థులు తల బయటకు పెట్టకుండా, తొంగిచూడకుండా గ్రిల్ అమర్చాలి. ప్రథమ చికిత్స బాక్స్, అత్యవసర ద్వారాలు ఉండాలి. కానీ ఇవేవీ కొన్ని విద్యాసంస్థలు పాటించడం లేదు. పాఠశాలల యజమాన్యాలు, డ్రైవర్లకు రవాణాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎంత చెప్పిన వారు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల రవాణా కోసం ఆటో, మినీ బస్సు, కండీషన్‌లేని వాహనాలను ఏర్పాటు చేసుకుని లాభార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. విద్యార్థుల రక్షణ విషయంలోను ఏ మాత్రం శ్రద్ధ చూపటం లేదు. సామర్థ్యానికి మించి విద్యార్థులను చేరవేస్తున్నారు. బస్సుల్లో విద్యార్థులు తల బయటకు పెట్టకుండా ఉండటం కోసం గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా దాదాపు 90శాతం ఈ ఏర్పాట్లు చేయడం లేదు. దీని కారణంగా విద్యార్థులు తల బయటపెట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లా రవాణాశాఖ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తేనే స్కూల్ యాజమాన్యాలు బస్సులను ఫిట్‌నెస్ చేయించుకుంటారని విద్యార్థులు వారి తల్లిదండ్రులు అభికోరుతున్నారు.



అయిజలో గ్రిల్ లేకుండా విద్యార్థులను చేరవేస్తున్న ప్రైవేటు పాఠశాల బస్సు


స్కూల్ యజమానులకు డ్రైవర్లకు అవగాహన నిర్వహించిన జిల్లా రవాణాశాఖాధికారి(ఫైల్)

అవగాహనతో అప్రమత్తం చేస్తున్నాం

పాఠశాలల యాజమాన్యానికి, సంబంధిత బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ వాహనానికి ఫిట్‌నెస్ సామర్థ్యపు పరీక్షలు చేయించుకోవాలి. అవసరమైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి. అలా కాకుండా వాహనం రోడ్డెక్కితే చట్టపరమైన చర్యలు తీసకుంటాం.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి

చట్టం ముందు అందరూ సమానమే

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 6 : చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఇందిర అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని సఖీ కేంద్రంలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. విపత్తు బాధితులకు న్యాయ సేవల కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అనేక స్కీంలను ప్రవేశపెట్టిందని ఆమె తెలిపారు. ప్రజల్లో న్యాయ అవగాహన కోసం పారాలీగల్ వాలంటరీలు, అసంఘటిత రంగంలోని కార్మికులకు న్యాయ సేవలు, ఉమెన్స్ ట్రాఫికింగ్ లైంగిక వేధింపులు, పిల్లలు స్నేహపూర్వక న్యాయ సేవలు, వారి రక్షణ, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవలు ఉన్నాయని ఆమె అన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ వృద్ధులపై వేధింపుల నివారణకై ఏర్పాటు చేసి జిల్లా ట్రిబ్యునల్‌లో ఎనిమిది కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కారంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని, పరిష్కరించేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ పుట్టపాగ రఘుపతి, యోగేశ్వర్‌యాదవ్, గ్రేస్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ రూరల్, జూలై 6 : స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు బైక్ మెకానిక్, సెల్ రిపేర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌బీఆర్ సెట్టి డైరెక్టర్ జి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ ఆపైన చదివిన నిరుద్యోగ యువత ఈ నెల 12 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

హంసవాహనంపై ఊరేగిన స్వామివారు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 6 : మహబూబ్‌నగర్‌లో కాటన్‌మిల్ వేంకటేశ్వర స్వామి 32వ బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు శనివారం హంస వాహనంపై ఊరేగారు. శ్రీ కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు గత నెల 30 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

- దీక్షలు ప్రారంభించిన అంగన్‌వాడీ ఉద్యోగులు

పాలమూరు, జూలై 6 : అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, 60ఏళ్లు పైబడిన వారికి రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్షల, జీవితంలో సగం పెన్షన్ చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంగన్ వాడీ ఉద్యోగులకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయింది, నేడు కొత్త ప్రభుత్వమైనా మేలు చేయాలని కోరారు. న్నారు. అంగన్‌వాడీల సమస్యలపై 6వ తేదీ నుంచి రిలే నిరాహారదీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినట్లు తెలిపారు. దీక్షలో భారతమ్మ, నరసమ్మ, పోచమ్మలు కూర్చున్నారు. కార్యక్రమంలో వరద గాలెన్న, వెంకటయ్య, బి.చంద్రకాంత్, కావలి రాజు, తిరుపతయ్య, లక్ష్మణ్, సయ్యద్, సురేష్ మద్దతుగా నిలిచారు.

UNANIMOUS EPIC BLOCKBUSTER
విజయవంతమైన 2వ వారం
తగ్గించబడిన టికెట్ రేట్స్
మల్టీప్లెక్స్: 295/-, 350/-, సింగిల్ స్క్రీన్: 175/-,110/-, 50/-



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 - కాచిగూడ 10.45,2.15,5.45,9.15
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ (3D) 11.00,2.30,6.00,9.30
మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
భ్రమరాంబ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
తెలుగు 2D
తెలుగు 3D
హిందీ 3D
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
రాజధాని డీలక్స్ ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన సినీస్క్వేర్ - ఉప్పల్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన రాధిక - కాప్రా
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంజికెబి సినీస్క్వేర్ - నారపల్లి
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | శ్రీ శిరిడి శివాని - బీరంగూడ
గలేరియా - పంజాగుట్ట | సినీపోలిస్ - బాలానగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | సినీపోలిస్ - చందానగర్
పీవీఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | సినీటౌన్ - మియాపూర్
పీవీఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి | జీపీఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఆట్రియమ్ - గచ్చిబౌలి | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్2 నోమ - మల్లాపూర్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | స్కైమాల్ - సనత్‌నగర్
ఎం.పి. మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జివిఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్య - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షమీఫిషా - చింతల్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
సి.సి.సి.ఎల్ - మల్కాజ్‌గిరి | మూవీమ్యాక్స్ - మౌలాలి
మంత్రామాల్ - అత్తాపూర్ | జె.పి. సినిమాస్ - చందానగర్
సుధా - శాలిబండ | అజంతా సినిమాస్ - నల్లగండ్ల
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ | మరియు
ఏషియన సత్యం - అమీర్‌పేట | మీ అభిమాన థియేటర్లలో
GLOBAL CINEMAS RELEASE

ఈనెల 12న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
GHR
SUCHIN CINEMAS 9030161717

FAMILY ENTERTAINMENT విజయవంతమైన 3వ వారం



శ్రీరామ 70ఎంఎం ఎ/సి - వనస్థలి
భువనేశ్వరి 70ఎంఎం ఎ/సి - బిజా
పరమేశ్వరి 70ఎంఎం ఎ/సి - కొత్తకోట
PARAM JYOTHI FILMS 9848028739

మానవత్వం చాటుకున్న ఎస్సై

- మతిస్థిమితం లేని వృద్ధురాలికి చికిత్స
- కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగింత



శాంతినగర్‌లో మతిస్థిమితం లేని వృద్ధురాలికి వైద్యం చేస్తున్న వైద్యులు

వడ్డేపల్లి, జూలై 6 : ప్రధాన రోడ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో మానసిక స్థితి సరిగ్గా లేని ఎందరో వృద్ధులు అచేతనంగా కాలం వెళ్లదీస్తుంటారు. అటుగా వెళ్లేవారు వారి వివరాల కోసం ప్రయత్నిస్తే ఎటువంటి సమాధానం లభించదు. ఇలా ఎంతోమంది మానసిక వికలాంగులు, వృద్ధులు నిస్సహాయ స్థితిలో కళ్లవెంట ధారతో తమ కోసం ఎవరైనా వస్తారా అంటు ఎదురుచూస్తూ జీవనం సాగిస్తుండటం మనకు కనిపించే దృశ్యాలు. ఎవరినైనా అయ్యో పాపం అనేలా చేస్తాయి. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపల్ కేంద్రంలోని శాంతినగర్‌లో అచేతనంగా ఉన్న ఓ మతిస్థిమితం లేని వృద్ధురాలికి ఎస్సై సంతోష్ సపర్యలు అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే మానసిక స్థితి సరిగ్గాలేని మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామానికి చెందిన అంజనమ్మ(50) శనివారం శాంతినగర్ పట్టణంలో మీ సేవా సెంటర్ సమీపంలో స్పృహ తప్పి పడిపోయింది. అటుగా వెళ్తున్న శాంతినగర్ పోలీసులు విషయాన్ని ఎస్సై సంతోష్‌కు చేరవేశారు. ఆమెకు తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సై ఆదేశించగా, స్పందించిన పోలీసులు వృద్ధురాలికి ముందుగా ప్రథమచికిత్స అందించిన అనంతరం ఆహారం, దుస్తులను అందించారు. వారి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్న పోలీసులు రక్తసంబంధీకులను పిలిపించారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఆమెను వారికి అప్పజెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


- కుళ్లిన గుడ్ల కథనానికి స్పందించిన అధికారులు
- విచారణతోనే సరిపెడుతారా..? చర్యలేమైన తీసుకుంటారా..?



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న డీడబ్ల్యూవో జరినా

మిడ్జిల్, జూలై 6: అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం డీడబ్ల్యూవో జరినా మిడ్జిల్ మండలంలోని మున్ననూర్, మిడ్జిల్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాలను, రికార్డులను పరిశీలించి కుళ్లిన గుడ్ల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జరినా మాట్లాడుతూ నాణ్యతలేని గుడ్లు సరఫరా చేసిన విషయం గురించి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి, అంగన్‌వాడీ టీచర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోనున్నట్లు డీడబ్ల్యూవో తెలిపారు. దీంతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్పన, టీచర్ నర్మదలకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. మొక్కుబడిగా విచారణ చేపట్టి చేతులు దులుపుకుంటారేమోనని లబ్ధిదారులు విచారం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటివి పరిపాటిగా సాగుతున్నాయని, బాధ్యులపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని లేని యెడల ఆందోళనలు చేపడుతామని పలు గ్రామాలకు చెందిన యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆమె వెంట సీడీపీవో మెహర్‌ఉన్నిసాబేగం ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం



రాచమోని రాములు

భూత్పూర్, జూలై 6: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోతులమడుగు గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపైన చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని శేరిపల్లి(హెచ్) గ్రామానికి చెందిన రాచ మోని రాములు (70), భార్య సుక్కమ్మ ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందింది. దాంతో తీవ్ర మనస్తాపం చెంది మతిస్థిమితం కోల్పోయాడు. అయితే శనివారం తెల్లవారుజా మున ఇంట్లో నుంచి ఎవరికీ చెప్ప కుండా బయటకు వెళ్లిపోయాడు. చాలా సేపు వరకు రాములు తిరిగి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుమారుడు రాచ మోని మునయ్య చుట్టూ పక్కల వెతికాడు. పోతులమడుగు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రాములు మృతి చెందాడు. వాహనాల ఎక్కిపోవ డంతో మృతదేహం గుర్తు పట్టలేని విధంగా రోడ్డుకు హత్తుకొనిపోయినది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

మిడ్జిల్, జూలై 6: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి సమీపంలో కొత్తూరు రోడ్డులో ఉన్న దుందుబీవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాలకృష్ణ తెలిపారు. దుందుబీవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం రావడంతో వాగు వద్దకు తమ సిబ్బంది వెళ్లి చూడగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించినట్లు తెలిపారు. డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారు కావడంతో తమ సిబ్బంది ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మన్ననూర్, జూలై 6: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మారెమాన్ దిన్నె గ్రామానికి చెందిన 10, 12 ఏళ్లున్న ఇద్దరు చెంచు బాలుపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా చెంచు సేవా సంఘం ఉపాధ్యక్షుడు దాసరి రాజేంద్ర ప్రసాద్, గౌరవ సలహాదారు కనెమోని శంకరయ్య డిమాండ్ చేశారు. చెంచుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని బంగారయ్య, కిష్టయ్య అనే వ్యక్తులు నాలుగు నెలలుగా గొర్రెల కాపరిగా జీతం పెట్టుకున్నారని, మాట వినలేదని దాడికి పాల్పడారని , సదురు వ్యక్తు లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దకొత్తపల్లి ఠాణాలో ఎస్‌ఐ కి సం ఘం తరపున ఫిర్యాదు చేశామని తెలిపారు.

15 లోపు పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

పాలమూరు యూనివర్సిటీ, జూలై 6 : పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న పీజీ కళాశాల ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌సీ నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ ఈ నెల 15 వరకు చెల్లించాలని పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు కూడా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని అన్నారు. రూ.300 అపరాధ రుసుంతో ఈ నెల 19 తేదీలోగా చెల్లించాలని తెలిపారు. అదే విధంగా రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ ఇంప్రూమేంట్, సప్లిమెంటరీ పరీక్షల ఫీజులను కూడా చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు పాలమూరు యూనిర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నీళ్లున్నా వృథానే

- రామన్‌పాడు ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటి నిల్వ
- ప్రారంభంకాని ఎత్తిపోతల పథకాలు
- ఇప్పుడు మరమ్మతులు చేపడుతున్న అధికారులు
- సరళాసాగర్‌లో నీరు లేక వెలవెల

మదనాపురం, జూలై 6: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఎత్తిపోతల పథకాల పరిస్థితి తయారైంది. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో రామన్‌పాడు రిజర్వాయర్ పరిధిలో సరళాసాగర్, నెల్విడి, కురుమూర్తి రాయ మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఎప్పుడైతే రామన్‌పాడుకు నీరు వదులుతారో వెంటనే లిఫ్టులను ప్రారంభించాలి. దానికి అనుగుణంగా ఏమైనా మరమ్మతులు ఉంటే ముందుగానే చేయించాలి. ఈ లిఫ్టుల పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల వరి సాగవుతుంది. సరళాసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన లిఫ్టును రెండు వారాల క్రితం ఎమ్మెల్యే జి.మదుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కాని లిఫ్టు పరిధిలో అయిదు మోటార్లకు గాను రెండు మాత్రమే పని చేస్తున్నాయి. ఏవైన మరమ్మతులకు గురైతే నిరంతరంగా నడుపలేని పరిస్థితి. దాంతో ఏమి చేయాలో అర్థం కాక భయపడుతూ సరళాసాగర్‌కు పంపింగ్ చేస్తున్నారు. సరళాసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీరు 21 ఫీట్లకు గాను కేవలం అయిదు ఫీట్ల మేర ఉండడంతో కనీసం వరి తుకాలకు కూడా నీటిని వదలడం లేదు. ఉన్న నీటికి కూడా నాన్ ఆయకట్టు రైతులు అక్రమంగా మోటార్లు బిగించి తోడేస్తున్నారు. ఇలా పంపింగ్ జరిగితే సరళాసాగర్ ఆయకట్టుకు నీరు వదిలే అవకాశాలు తక్కువ. భారీ వర్షాలు పడి సరళాసాగర్‌కు వరద వస్తేనే ఖరీఫ్‌లో పంటలు వేసుకోవడానికి వీలుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నెల్విడి అయోమయం...

నెల్విడి ఎత్తిపోతల పథకం పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. కమిటీలో డబ్బులు లేకపోవడంతో లీకేజీలు అరికట్టలేకపోతున్నారు. నాలుగు సంవత్సరాల క్రిందట కొన్నూరు గ్రామానికి ప్రముఖ సామాజికవేత్త శరత్ రెడ్డి తన స్వంత ఖర్చులతో లిఫ్టును నడిపించడం తో చెరువులన్నీ నిండాయి. ప్రస్తుతం దీనిని పట్టించుకునే నాథుడే లేడని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రబీలో లీకేజీల మరమ్మతుల కోసం సొంతగా డబ్బులు ఇచ్చినా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎలాంటి పనులు చేయకుండానే కొన్నిరోజులు తూతూ మంత్రంగా మోటార్లను నడిపి బంద్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మరమ్మతు పనులను లిఫ్టు కమిటీ చేపట్టింది. వాటిని త్వరగా పూర్తి చేసి మరో పది రోజుల్లో నీరు వదులుతామని చెబుతున్నారు. సమీపంలోని రామన్‌పాడు రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉన్నప్పుడే లిఫ్టులను ప్రారంభిస్తే రైతులు సకాలంలో పంటలు వేసుకోవడానికి వీలుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిండుగా ఉన్న రామన్‌పాడు రిజర్వాయర్



అడుగంటిన సరళాసాగర్ ప్రాజెక్టు

మోటార్లను నిరంతరం నడిపించాలి



సరళాసాగర్ లిఫ్టుకు సంబంధించిన మోటార్లను నిరంతరం నడిపించాలి. అప్పుడే ప్రాజెక్టుకు నీరు భారీగా చేరుతుంది. అలాగే మరమ్మతులో ఉన్న మోటార్లకు రిపేర్లు చేయించాలి. లిఫ్టు కమిటీ ముందస్తుగా ఇలాంటి పనులు చేపట్టి ఉంటే ప్రాజెక్టులోకి నీరు వచ్చి ఉండేది. ఇప్పుడు భారీ వర్షాలు పడితేనే సరళాసాగర్‌కు నీరు వచ్చి పంటలు వేసకునే పరిస్థితి వచ్చింది.

- సూరిబాబు మదనాపురం

నెల్విడి లిఫ్టును పట్టించుకోవాలి



నెల్విడి ఎత్తిపోతల పథకం లిఫ్టును గతంలో కొన్నూరు గ్రామానికి చెందిన శరత్‌రెడ్డి స్వయంగా నడిపించారు. అలా రెండు సంవత్సరాలు లిఫ్టు నడిచింది. కనీసం ఇప్పుడు మరమ్మతులు చేయించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. స్థానిక ఎమ్మెల్యే లిఫ్టు మీద దృష్టి సారించాలి.

- కోట్ల రాజు నెల్విడి

నేటి నుంచి ఆయుత చండీ యాగం

- హాజరు కానున్న 800 మంది వేద పండితులు
- ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 6: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 83వ శ్రీ కృష్ణ కాల చక్రం ఆయుత చండీ అతిరుద్ర విశ్వశాంతి మహా యాగ మహోత్సవం ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ మాట్లాడారు. పట్టణంలోని ఓంనగర్ కాలనీలో ఆదివారం నుంచి ఈ నెల 21 వరకు పదిహేను రోజుల పాటు ఆయుత చండీ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మంది వేద పండితులు హాజరై హోమాలను నిర్వహిస్తారని, ప్రతీ రోజు 400 మంది జంటలు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ మహోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చనలతో పాటు మట్టితో తయారు చేసిన 10 వేల లింగార్చన, అమ్మవారికి లక్ష గాజుల సమర్పణ, శ్రీ రాధాకృష్ణ కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే ప్రజల నుంచి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉచితంగా నిర్వహించే ఈ సదావకాశాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని స్వామిజీ సూచించారు. దాదాపు నాలుగు ఎకరాల స్థలంలో మూడు హోమ మండపాలతో పాటు నిత్య మహోత్సవ కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ, సందర్శకుల కోసం ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు గోపూజతో మొదలై సాయంత్రం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి శోభాయాత్రతో యాగ కార్యక్రమాలు ప్రారంభం కా నున్నట్లు తెలిపారు. ఆయుత చండీ యాగాన్ని పు రస్కరించుకుని పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ నుంచి బస్టాండు కూడలి వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు.



చండీమాత ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా చండీమాత ఊరేగింపు

కృష్ణపీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో నిర్వహిస్తున్న ఆయుత చండీ అతిరుద్ర మహాయాగ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి చండీమాత అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి వందలాది మంది మహిళా భక్తులు కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. శోభాయాత్రలో భజంత్రిలు, భక్తుల కోలాటాలు, నృత్య కోలాహలం మధ్య చండీమాతను ప్రత్యేక రథంలో యాగస్థలి వరకు తీసుకెళ్లారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్తపై భార్య ఫిర్యాదు

తిమ్మాజిపేట, జూలై 6 : అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని భర్తపై భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలో గొరిట గ్రామానికి చెందిన చంద్రకళకు వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండల పరిధిలోని సల్కెలాపూర్ గ్రామానికి చెందిన బండారు యాదయ్యతో పదేళ్ల క్రితం వివాహం అయింది. చంద్రకళ కుటుంబసభ్యులు పెళ్లి సమయంలో రూ. లక్ష నగదు, ఐదు తులాల బంగారుం కట్నంగా ఇచ్చారు. ఇటీవల అదనపు కట్నం తేవాలని యాదయ్య వేధింపుల కు గురి చేస్తూ చంద్రకళను పుట్టిల్లు గొరిటకు పంపాడు. తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, చట్టప రమైన చర్యలు తీసుకోవాలని తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో చంద్రకళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు న మోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ లీకేజీతో సిలిండర్‌లో మంటలు

- తప్పిన పెను ప్రమాదం



సిలిండర్ నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చారకొండ, జూలై 6: గ్యాస్ లీకేజీతో సిలిండర్‌లో మంటలు వ్యాపించాయి. అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని జూపల్లిలో కిష్టమ్మ అనే వృద్ధులు ఇంట్లో సిలిండర్ లీక్ అయింది. గమనించకుండా వంట చేసేందుకు కిష్టమ్మ సిలిండర్ స్టౌను అగ్గిపుల్లతో అంటించడంతో ఒక్కసారిగా సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో వృద్ధురాలు కేకలు వేసుకుంటూ బయటకు వచ్చింది. స్థానికులు వచ్చి కర్ర సహాయంతో సిలిండర్‌ను బయటకు తీశారు. సిలిండర్ నుంచి మంటలు అధికం కావడంతో కల్వకుర్తి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు తమ సిబ్బందింతో ఘటన స్థలానికి చేరుకొని మంటలను అర్పారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

కల్వకుర్తిటౌన్, జూలై6 : ప్రమాదవశాత్తు రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దకికి త్రీవగాయాలు అయ్యాయి. ఈ ఘటన కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ చౌరస్తాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం... నాగర్‌కర్నూల్ చౌరస్తాలో పాలమూరు వైపునుంచి కల్వకుర్తి వైపు వస్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో తిరుపతయ్య అనేవ్యక్తి కాలు విరగగా, మరోవ్యక్తికి గాయాలు అయ్యాయి. గాయపడ్డవారిని ప్రభుత్వ ఆసుపతికి తరలించి ప్రథమచికిత్స అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వాడ్యాల సమీపంలో..

మిడ్జిల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం వాడ్యాల సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. స్థానికల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మేడిపల్లి తిరుపతిరెడ్డి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో తిరుపతిరెడ్డికి తీవ్రంగా గాయాలైనట్లు స్థానికులు శనివారం తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. మిడ్జిల్‌కు చెందిన తిరుపతిరెడ్డి తన ద్విచక్ర వాహనంపై వెలిజాల చౌరస్తా వద్ద మళ్లీ వాడ్యాల వైపు మళ్లుచుండగా కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. దాంతో తిరుపతిరెడ్డికి గాయాలు అయ్యాయి. షయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని పోలీసు వాహనంలో జడ్చర్లలోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెద్దమందడి, జూలై 6: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన పెద్దమందడి మండలంలో శనివారం చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం పెద్దమందడి మండలం గట్లఖానాపూర్ గ్రామ పంచాయతీ స్కూల్ తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ రెండు కోడెలు ఉన్నాయి. మేతకు విడిచిపెట్టగా కంచలేని విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ తీగలు తగిలి ఎద్దు మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు.

ఎట్టకేలకు వీఆర్‌ఏలకు పోస్టింగ్

- 35 మందికి పలు జిల్లాల్లో నియామకం
- చనిపోయిన ఓ వ్యక్తికి పోస్టింగ్ కేటాయింపుపై విమర్శలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్, జూలై 6: ఎట్టకేలకు 35మంది వీఆర్‌ఏలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. గతనెల 29న రెండికి చెడ్డ రేవడి శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. 35మంది వీఆర్‌ఏలకు 11 నెలలుగా పోస్టింగ్‌లు ఇవ్వకుండా అటు వీఆర్‌ఏ, ఇటు జూనియర్ అసిస్టెంట్ జీతాలకు నోచుకోకుండా రెంటికి చెడ్డారని వార్త ప్రచురితమైంది. అయితే ఎట్టకేలకు మహబూబ్‌నగర్ మునిసిపాలిటీకి అలాట్ చేసి పోస్టింగ్‌లు ఇవ్వని 18మందికి, జడ్చర్ల మునిసిపాలిటీలో అలాట్‌కాని 17 మందికి వివిధ జిల్లాలలో పోస్టింగ్‌లు సీసీఎల్‌ఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరితోపాటు మరో పది మందికి వివిధ జిల్లాలలో పోస్టింగ్‌లు కేటాయించారు. పోస్టింగ్‌లు అలాటైన వారిలో కొందరిని నిర్మల్, వికారాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలకు పలు శాఖలలో జూనియర్ అసిస్టెంట్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈనెల 3న సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేసిన 4వ తేదీ సాయంత్రం వరకు ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి సంబంధిత అధికారులు తీసుకెళ్లలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా నాలుగు నెలలక్రితం చనిపోయిన ఓ వ్యక్తికి ప్రస్తుతం పోస్టింగ్‌ల జాబితాలో చేర్చడం, చనిపోయిన ఆ వ్యక్తికి వనపర్తి జిల్లా అలాట్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆరు నెలలక్రితమే చనిపోయిన వ్యక్తి పేరు తొలగించకుండా కొత్తగా కేటాయించిన పోస్టింగ్‌లలో ఆయన పేరు రావడంతో అధికారుల అలసత్వంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బెల్లం పానకం ధ్వంసం

- ఏడు కేసులు నమోదు, నలుగురు వ్యక్తుల అరెస్టు
- ఎక్సైజ్ శాఖ సీఐ వెంకట్‌రెడ్డి వెల్లడి



ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడ్డ వ్యక్తితో సీఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది

కల్వకుర్తి, జూలై 6 : కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ , ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ అధికారులు శనివారం విస్తృత దాడులు నిర్వహించి 40కేజీల బెల్లం, 15కేజీల పటిక, 26లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 1800లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఏడు కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ రాజ్యలక్ష్మీ, ఎస్‌ఐలు జ్యోతి, అరుణ, సిబ్బంది మహేష్, నర్స్యా, పరుశరామ్, కృష్ణవేణి, తిరుపతి రెడ్డి, డీటీఎఫ్, ఎస్‌టీఎఫ్ సిబ్బంది తదితరులున్నారు. అదేవిధంగా కొత్త గేటు సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా హైదరాబాద్ గంజ్ నుంచి అచ్చంపేట మండలం బొల్గట్‌పల్లి తండాకు బొలెరోలో 570(19బస్తాలు) నల్లబెల్లం తరలిస్తుండగా గుర్తించారు. వాహనాన్ని ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు స్వాధీనపర్చుకున్నారన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, సిబ్బంది తదితరులున్నారు.

జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద ..

జడ్చర్ల : జాతీయరహదారి జడ్చర్ల ఫ్లైఓవర్ వద్ద 1500 కిలోల బెల్లం, 50 పటికను శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి ముక్కిడిగూడెంకు అక్రమంగా బెల్లం తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్ తెలిపారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్స్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డిల ఆదేశాల మేరకు ఆగస్టు 31నాటికి సారాను పూర్తిగా అరికట్టాలని నిర్ణయించిన టార్గెట్ మేరకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో 1500 కిలోల నల్లబెల్లం, 50 కిలోల పట్టికను, తరలించేందుకు వినియోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, ఎస్సై సృజన్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు



అయిజలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

అయిజ, జూలై 6: లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ విషయంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ మంగమ్మ హెచ్చరించారు.శనివారం గద్వాల జిల్లాలో అయిజ పట్టణంలోని మేకలశ్రీను, పహిల్వాన్, సుజాత, తుపతురాల గ్రామ హనుమన్నగౌడ్, ఉత్తనూర్ చంద్రశేకర్‌రెడ్డి, టీటీదొడ్డి నాగన్న దుకాణాలను తనఖీ చేశారు. బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిల్వల వివరాలను పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

అలంపూర్ చౌరస్తా, జూలై6: ఉండవల్లి మండల శివారులోని జాతీయరహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ ఆయిల్ చోరీకి గురైన ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఉండవల్లి గ్రామ శివారులో రాజగోపాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయభుమిని అదే గ్రామానికి చెందిన గొల్లవేణుగోపాల్ అనే రైతుకౌలుకు సాగు చేస్తున్నాడు. గత 25న వ్యవసాయ ట్రాన్స్‌పార్మర్‌లో ఆయిల్ చోరీకి గురైనట్లు తెలుసుకుని భుమి యాజమానికి సమాచారం ఇవ్వగా శనివారం ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు తెలిపారు.

జడ్పీ ప్రత్యేకాధికారిగా

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను సత్కరించిన డీఆర్‌డీవో, సిబ్బంది

గద్వాల, జూలై 6 : జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బీఎం.సంతోష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల నాలుగున జడ్పీ పాలకవర్గం కాలపరిమితి తీరిపోవడంతో శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన వచ్చింది. ప్రత్యేకాధికారిగా కలెక్టర్ నియామకం కావడంతో కార్యాలయానికి వచ్చిన ఆయనకు డీఆర్‌డీవో నర్సింగ్‌రావు ఆహ్వానం పలికి చాంబర్‌లోకి తీసుకెళ్లారు. జడ్పీ చాంబర్‌లో కలెక్టర్ బాధ్యతలు స్వీకరించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందిని డీఆర్‌డీవో పరిచయం చేశారు. కార్యాలయంలో విధుల గురించి తెలుసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని, సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్‌ను డీఆర్‌డీవోతో పాటు కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

కాగా, 12మండలాలకు ప్రత్యేకాధికారులు నియమితులయ్యారు. వారు కూడా శనివారం బాధ్యతలు స్వీకరించారు. గద్వాలకు పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అలంపూర్‌కు డీఈవో ఇందిర, ధరూర్‌కు ఫిషరీష్ అధికారి షకీలాభాను, గట్టుకు లేబర్ ఆఫీసర్ వెంకటరమణ, అయిజకు డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, ఇటిక్యాలకు ప్లానింగ్ అధికారి లక్ష్మణ్, కేటీదొడ్డికి హార్టికల్చర్ అధికారి అక్బర్, మానవపాడుకు జిల్లా వ్యవసాయ అధికారి గోవిందనాయక్, మల్దకల్‌కు జడ్పీ సీఈవో కాంతమ్మ, రాజోలికి కోఆపరేటివ్ అధికారి ప్రసాద్‌రావు, ఉండవెల్లికి ఎస్‌డీసీ శ్రీనివాసరావు, వడ్డేపల్లికి ఆర్డీవో రాంచందర్‌లు నియమితులయ్యారు.

భూరికార్డుల పరిశీలన



ఉండవల్లి తహసీల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో పి.రాంచందర్

ఉండవల్లి, జూలై 6 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆర్డీవో రాంచందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు భూరికార్డులను పరిశీలించారు. మండలంలో రెవెన్యూపరంగా పలు అంశాలను తహసీల్దార్ సలీముద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. మారమునగాల గ్రామంలో సర్వే నెంబర్ 188లో ఆ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులుకు సంబంధించిన ఏడెకరాల పట్టాభూమి ఇనాం భూమిగా నమోదు కావడంతో రైతు కొన్నిరోజుల కిందట మండల కార్యాలయంలో అర్జీ పెట్టుకున్నాడు. మండల అధికారులు పొలానికి సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు పంపడంతో శనివారం ఆర్డీవో అందుకు సంబంధించిన పొలాన్ని మారమునగాల గ్రామానికి వెళ్లి పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం

» నూతన నేరచట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూలై 6 : నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. కొత్త చట్టాలపై పోలీస్ అధికారులకు, పోలీస్‌స్టేషన్‌ల రైటర్లకు, సీసీటీఎన్ఎస్ రైటర్లకు, కోర్టు డ్యూటీ అధికారులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన నేరన్యాయ చట్టాలు-2023 ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వచ్చాయని, ప్రజలకు మరింత సమర్థ వంతంగా సత్వర సేవలు అందించే అవకాశం నూతన చట్టాల్లో కల్పించబడిందన్నారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. నూతన సెక్షన్లను సిబ్బంది కూలంకుషంగా నేర్చుకోవాలని ఆదేశించారు. న్యాయ నిపుణుడు, పోలీస్ లీగల్ అ డ్వయిజర్ రిటైర్డ్ పీపీ రాములు కొత్త చట్టాలపై వారికి అవగాహనతో పాటు వారికి ఉన్న సందేహాలను ని వృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

» పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

గద్వాల, జూలై 6 : జిల్లాలో పెంపుడు కుక్కలను పెంచుతున్న యజమానులు తప్పనిసరిగా వాటికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం జిల్లా వెటర్నరీ హాస్పిటల్‌లో ఉచిత వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంపుడు కుక్కల యజమానులతో పాటు వారి కుటుంబ సభ్యులు చాలా దగ్గర ఉండటంతో పాటు వాటి ఆలనాపాలన చూస్తుంటారని, అలాంటి సమయంలో కుక్కల నుంచి రేబిస్, హడాటిడ్ సిస్ట్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వివరించారు. వీటి నుంచి నివారణ పొందడానికి ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. ప్రతీ ఒక్కరు వారి కుక్కలకు వ్యాక్సినేషన్‌ను వేయించాలని లేకపోతే కుక్కల ద్వారా రేబిస్ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆంధ్రాలో కుక్క యజమాని వ్యాక్సినేషన్ చేయించకపోవడంతో దాని ద్వారా తండ్రి, కొడుకు రేబిస్ వ్యాధి బారిన పడి మృతి చెందిన సంఘటనను ఆయన వివరించారు. కాగా, వ్యాక్సినేషన్‌కు దాదాపు 57 మంది కుక్కల యజమానులు వచ్చి వారి కుక్కలకు వ్యాక్సిన్ వేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శంకరయ్య, జేవీవో ఉమాదేవి, వీఏ తేజస్వీ, సీవోఎస్ పాష తదితరులున్నారు.

షాదీఖానా కోసం కేటాయించిన భూమికి

ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌కు వినతి

గద్వాల న్యూటౌన్, జూలై 6 : జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీ సర్వే నెం.1024లో ప్రభుత్వం షాదీఖానా కోసం కేటాయించిన 1.30 ఎకరాల భూమికి ప్రహరీ నిర్మించాలని శనివారం ఎంఐఎం నాయకులు కలెక్టర్ బీఎం.సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం అధ్యక్షుడు మున్నబాష మాట్లాడుతూ సర్వే నెం.1024లో జీవో నెంబర్ 68 ప్రకారం 2020 జూలై 27న షాదీఖానా కోసం ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు. అయితే ఈ భూమికి ప్రహరీ లేనందున కబ్జాదారులు దొంగపత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. షాదీఖానా భూమికి ప్రహరీ నిర్మించి భూమిని రక్షించేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా సెక్రటరీ ఇమాముద్దీన్, మండల అధ్యక్షుడు రఫీ, జిల్లా జాయింట్ సెక్రటరీ షర్ఫుద్దీన్, మాజీ కౌన్సిలర్ అన్వర్, నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

'కన్వీనర్ బదిలీని నిలిపివేయాలి'

గద్వాల న్యూటౌన్, జూలై 6 : మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ రాంబాబు బదిలీపై వెళ్లడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆయన బదిలీని నిలిపివేయాలని శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తిమ్మప్ప, పెద్దజయన్న, జగదీష్, మధు, కృష్ణలు మాట్లాడుతూ జిల్లా కన్వీనర్ రాంబాబు ఇక్కడికి వచ్చినప్పటి నుంచి విద్యార్థులకు ఎటువంటి సమస్య లేకుండా చూశారన్నారు. అంతేగాక ప్రతీ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత వందశాతం వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. దీంతో పాటు విద్యార్థులకు మంచి ఆహారం అందిస్తూ ఆటల విషయంలో ప్రోత్సాహన్ని ఇస్తూ రాష్ట్ర స్థాయి వరకు ఎంతోమంది పిల్లలను వెళ్లేలా చేసిన ఘనత ఆయనకే వర్తిస్తుందన్నారు. అలాగే గద్వాల జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ పిల్లల అవసరాలను అడిగి తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జిల్లా కన్వీనర్ బదిలీని నిలిపివేయాలని వారు విన్నవించారు.

గద్వాల రహదారి మరమ్మతులు పాలకులకు పట్టవా.?

» బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టే మహేష్

అయిజ, జూలై 6 : అయిజ - గద్వాల రహదారి మరమ్మతులు పాలకులకు పట్టదా అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టే మహేష్ ప్రశ్నించారు. అయిజ సమీపంలోని కట్టకింద వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో గద్వాల రహదారిపై ఆయన రోడ్డుకు అడ్డంగా నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయిజ నుంచి గద్వాల వరకు రెండు లేన్ల రహదారి ఉన్నప్పటికీ అయిజ సమీపంలో ఒక కిలోమీటర్ దూరం వరకు ఒక లైను రహదారి ఉందన్నారు. ఇది సైతం గోతులతో ప్రయాణం సాగించటం కష్ట సాధ్యమని తెలిపారు. ఒక కిలోమీటర్ రహదారికి అరగంట సమయం పడుతున్న విషయం అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టదా అని ప్రశ్నించారు. గద్వాల లారీ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి మరమ్మతులు చేయించుకునే స్థాయికి వచ్చిందంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి ప్రయాణం సాగించటం సాధ్యం కాదని వెంటనే స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

ర్యాగింగ్ భూతాన్ని దరిచేరనీయొద్దు

» న్యాయాధికారి గంట కవితాదేవి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి గంట కవితాదేవి

గద్వాల టౌన్, జూలై 6 : ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ర్యాగింగ్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ర్యాగింగ్ భూతాన్ని దరిచేరనీయవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి గంట కవితాదేవి అన్నారు. 'ర్యాగింగ్ ముప్పు-నివారణ చర్యలు' అనే అంశంపై న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గద్వాల పీజీ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి మాట్లాడుతూ అపరిపక్వ ఆలోచనలతో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు తొలుత సరదాగా చేపట్టే ర్యాగింగ్ చివరకు విషాదాన్ని మిగిలిస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు సీనియర్, జూనియర్ అన్న భావన లేకుండా పరస్పరం సహరించుకుంటూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటి సాధన దిశగా కృషి సాగించాలన్నారు. ర్యాగింగ్‌కు గురైన అనేక మంది విద్యార్థులు ఆత్మనూన్యతతో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు మరచిపోలేనివని, అలాంటివి ఎక్కడా కూడా పునరావృతం కాకూడదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి మాట్లాడుతూ సరదా పేరుతో సాగే ర్యాగింగ్ వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురైన నేపథ్యంలో ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. దాన్ని విద్యార్థులు విధిగా పాటించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహులు బాలల సంరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1098 సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరవింద్, మంగళరి శ్రీనివాసులు, మహేందర్, గోపీనాథ్, గణేష్, అబ్జ, రవిశేరిన్, రఫీ, ఆంజనేయులు, గట్టయ్య, లక్ష్మయ్య, రంగారెడ్డి, నవీన్‌గౌడ్, వైష్ణవ్, ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, లక్ష్మణచారి, న్యాయవాది లక్ష్మణ్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది ఉన్నారు.

అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

» అదనపు కలెక్టర్ నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల న్యూటౌన్, జూలై 6 : జిల్లాలో ఉన్న వయోజనులందరికి న్యూఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 15 సంవత్సరాలు పైబడిన యువజనులందరికి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమెరసీ, బేసిక్ ఎడ్యుకేషన్, క్రిటికల్ స్కిల్స్, కంటిన్యూ ఎడ్యుకేషన్ అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. 2022 నుంచి 2027 వరకు కనీసం ఐదు కోట్ల మందిని అక్షరాస్యులుగా చేయాలన్నదే ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. వలంటీర్లుగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, గ్రామంలో చదువుకున్న యువతీ యువకులను ఎంపిక చేయాలన్నారు. వయోజనులకు అనుకూలమైన సమయంలో విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చదువుకోవడానికి అవసరమైన బోధనా అభ్యసన సామగ్రి పూర్తి ఉచితంగా పంపిణీ చేయబడుతుందన్నారు. సమావేశంలో డీఈవో ఇందిర, సీపీఐ లక్ష్మన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, జిల్లా సెక్టోరియల్ అధికారి హంపయ్య, ఎస్తేర్‌రాణి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

మీ సేవ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలి

జిల్లాలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు ఎంపీడీవోలను ఆదేశించారు. శనివారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం(సెర్ప్) సీఈవో దివ్య హైదరాబాద్ నుంచి డీఆర్‌డీవోలతో మీ సేవా కేంద్రాల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను వ్యాపార రంగాల్లో ప్రోత్సహించేందుకు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిర మహిళాశక్తి శ్రీపథకం ద్వారా మీ సేవ కేంద్రాలు మంజూరుకు నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు 20 కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. విద్యార్హతను బట్టి పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో గవర్నమెంట్ లొకేషన్‌లో మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో సరైనా సౌకర్యాలు ఉన్నాయా, లేదా సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఈడీఎం శివ తదితరులున్నారు.

పనులు వేగవంతం చేయాలి

» కేజీబీవీ పనులను పరిశీలించిన ఎస్‌వో-1 జిల్లా అధికారి



పనులను పరిశీలిస్తున్న కేజీబీవీ ఎస్‌వో-1 జిల్లా అధికారి శాంతిరాజు

రాజోలి, జూలై 6 : కేజీబీవీలో చేపట్టిన పనులు వేగవంతంగా, త్వరగా పూర్తి చేయాలని కేజీబీవీ ఎస్‌వో-1 జిల్లా అధికారి శాంతిరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం ద్వారా చేపడుతున్న విద్యాలయం మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతి గురించి కాంట్రాక్టర్ పి.దస్తగిరిని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సంపు పనులను త్వరగా పూర్తి చేయాలని, పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కేజీబీవీ పాఠశాల ఎస్‌వో చంద్రకళ, ఉర్దూ పాఠశాల హెచ్ఎం ఇక్బాల్, డీఎల్ఎంటీ రామాంజనేయులు, సీఆర్‌పీ శాంతయ్య ఉన్నారు.

సామాజిక న్యాయం కోసం జగ్జీవన్‌రామ్ కృషి

» అయిజ మునిసిపల్ చైర్మన్ దేవన్న

» జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



గద్వాలలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అయిజ/అయిజ టౌన్, జూలై 6 : బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం కోసం కృషి చేసిన మహానుభావుడని అయిజ మునిసిపల్ చైర్మన్ దేవన్న అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన మహానుభావుడని ఆయన పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు.

● గద్వాల టౌన్ : నిరుపేద కుటుంబంలో జన్మించి, రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి దేశ ఉప ప్రధానిగా సేవలందించిన బాబు జగ్జీవన్‌రామ్ నిష్కళంక ప్రజా నాయకుడని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు డీకే.సుందర్‌రాజ్ కీర్తించారు. బాబూజీ 38వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని దివంగత నాయకుడి విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ప్రజాజీవితంలో తాను నమ్మిన సామ్యవాద సిద్ధాంతాన్ని ఆచరించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఆంజనేయులు, పరశురాం, గట్టు తిమ్మన్న, రంజిత్‌కుమార్ పీడీఎస్‌యూ నాయకులు వంశీ, హలీం, రంగస్వామి ఉన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం

» జయంతి వేడుకలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



గద్వాలలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న బీజేపీ నాయకులు


గద్వాల, జూలై 6 : డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం డీకే బంగ్లాలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ లేకుంటే జన్‌సంఘ్ లేదని అన్నారు. కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు అనే ఎజెండా ఉండేది కాదని పేర్కొన్నారు. ఏకదేశ్‌మే దో విధాన్, దో ప్రధాన్ నహీ చలుంగా అనే నినాదంతో ముందుకు వెళ్లారని వివరించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు 36వ వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములుయాదవ్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ రజక జయశ్రీ, నాయకులు బల్గెర శివారెడ్డి, రాంచంద్రారెడ్డి, దేవదాసు, రజక నర్సింహులు, పాల్వాయి రాముడు, అనిమిరెడ్డి, నాగప్ప తదితరులున్నారు.

● వడ్డేపల్లి : శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని రామచంద్రానగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణవాల్మీకి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని ఇచ్చిన పిలుపుమేరకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి ఆవరణల్లో, కాలనీల్లో మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

● అయిజ : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ స్వామి, భగత్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

● గట్టు : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు బల్గెర శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గూడురు నాగప్ప, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి సురేష్, సంజీవనాయుడు, యు.వెంకటేష్, సోమన్న తిరుమల్‌రెడ్డి తదితరులున్నారు.

వర్గీకరణ దీక్ష కరపత్రాలు విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్ చౌరస్తా, జూలై 6 : ఏబీసీడీ వర్గీకరణ కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే విజయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలో ఎమ్మెల్సీ చల్లా బంగ్లాలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. వంగపల్లి శ్రీనివాస్ తలపెట్టిన దీక్షకు మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని ఎమ్మెల్యే అన్నారు. వెంటనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమదాసు, లక్ష్మణ్, జయన్న, వెంకటేష్ ఉన్నారు.

సహకార సంఘాల ద్వారానే సమస్త అభివృద్ధి

» విండో చైర్మన్ పోతుల మధుసూదన్‌రెడ్డి

అయిజ, జూలై 6 : సహకార సంఘాల ద్వారానే సమస్త అభివృద్ధి సాధ్యమవుతుందని ఉమ్మడి జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు, అయిజ సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని అయిజ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సహకార జెండాను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్లు బింగిదొడ్డి దొడ్డప్ప, కార్యదర్శి మల్లేష్, సిబ్బంది జీవన్, భీమార్జునరెడ్డి, శ్రీనివాస్, భక్తప్రహ్లాద, రాజు, రఘు, లావణ్య, కళావతి, కృష్ణవేణిలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ముందు జెండా ఎగురవేత

మానవపాడు, జూలై 6 : మండల కేంద్రంలోని పీఏసీఎస్ ముందు అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సీఈవో ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం ఆ సంస్థకు చెందిన జెండాను ఎగురవేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో జెండాను ఎగురవేసినట్లు సీఈవో వివరించారు. కార్యక్రమంలో సంస్థ మాజీ కార్యదర్శి మద్దిలేటి, విజయ్, రమేష్ తదితరులున్నారు.

విదేశీ ఉన్నత చదువుల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల స్వీకరణ

గద్వాల టౌన్, జూలై 6 : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నుంచి జూలై 31 వరకు పీజీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తులో కుల, నివాస, ధ్రువీకరణపత్రం, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, ఇతర పత్రాలను అప్‌లోడ్ చేయాలన్నారు. వారికి రూ.20లక్షల స్కాలర్‌షిప్‌తో పాటు, విమాన టికెట్ ఖర్చులు అందజేస్తారన్నారు. ఆగస్టు ఏడవ తేదీలోగా దరఖాస్తు చేసుకున్నవారు హార్డ్‌కాపీలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆగస్టు 27వ తేదీలోగా అందజేయాలన్నారు.

సంపత్‌కు అధ్యక్ష పదవి అప్పగించాలి

అయిజ, జూలై 6 : అన్నివిధాల సమర్థుడైన సంపత్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి అప్పగించాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం అయిజ అంబేడ్కర్ విగ్రహం ముందు ఎస్సీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యేగా, ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న సంపత్‌కుమార్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తే అటు పార్టీకి, ఇటు ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం చేసినట్లవుతుందని ఆయన పార్టీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హంతకులను శిక్షించాలి

» బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

గద్వాల టౌన్/ఇటిక్యాల, జూలై 6 : బీఎస్పీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ గద్వాల జిల్లా అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. హత్యపై సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యను నిరసిస్తూ శనివారం గద్వాల పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీఎస్పీ నాయకులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక కుల, మతపరమైన రాజకీయ హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, వెంకటేష్‌నాయక్, బండారి ఎస్.రాజు, సవారన్న, సురేష్, నరేష్, బీసన్న, నగేష్‌లు ఉన్నారు. ఇటిక్యాలలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి రాంబాబుతో పాటు, నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మణికుమార్, బీసన్న, జాన్, హుస్సేన్, స్వామి దాస్, జమ్మన్న ఉన్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాలి

గద్వాల న్యూటౌన్, జూలై 6 : దివ్యాంగులకు రూ.ఆరు వేల పెన్షన్‌ను పెంచడంతో పాటు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు చంటి ఆధ్వర్యంలో కలెక్టర్ బీఎం.సంతోష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ వందశాతం వికలత్వం ఉన్న దివ్యాంగులకు రూ.15 వేలు పెంచాలని, ఆర్టీసీ బస్‌లో దివ్యాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహకాలు త్వరగా అందేలా చూడటంతో పాటు, బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం కల్పిస్తున్న ఆరు గ్యారెంటీలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత అమలయ్యేలా చూడటంతో పాటు, సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. దివ్యాంగుల నాయకులు వీరయ్యగౌడు, జయంతుడు, హనుమంతు, అల్లపాడు రమేష్, తిరుమలేష్ ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మల్దకల్, జూలై 6 : అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ఎంఈవో సురేష్ అన్నారు. శనివారం మల్దకల్ మండలం పావనంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మరిడి శ్రీకాంత్ గద్వాల మండలంలోని తెలుగోనిపల్లికి బదిలీపై వెళ్తుండగా గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంఈవో సురేష్ హాజరై, మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేష్, మండలంలోని జీహెచ్ఎంలు రాజేందర్, మహేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ కార్యాలయ సహ కార్యదర్శిగా శేఖర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సంకాపూర్ శేఖర్

అయిజ, జూలై 6 : బీజేపీ ఓబీసీ మోర్చా కార్యాలయ రాష్ట్ర సహ కార్యదర్శిగా సంకాపూర్ శేఖర్‌ను నియమిస్తూ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్‌గౌడ్ శనివారం హైదరాబాద్‌లోని నియామక పత్రాన్ని అందించారు. శేఖర్ గతంలో బీజేపీ అయిజ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. నియామక పత్రం అందుకున్న శేఖర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

కర్నూలు ఎంపీ నాగరాజుకు ఘన స్వాగతం

అలంపూర్ చౌరస్తా, జూలై 6 : ఎంపీటీసీ స్థాయి నుంచి ఒకేసారి ఎంపీగా టీడీపీ తరఫున పోటీచేసి పార్లమెంటుకు వెళ్లి వచ్చిన పంచలింగాలకు చెందిన బస్తీపాటి నాగరాజు యాదవ్‌కు శనివారం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద జనసేన, టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ కోడుమూరు ఇన్‌చార్జి రాంబాబు, కర్నూలు ఇన్‌చార్జి హర్షద్‌ల ఆధ్వర్యంలో పంచలింగాల సర్పంచ్ కృష్ణయాదవ్, టీడీపీ కార్పొరేటర్ పరమేష్ తదితరులతో కలిసి పంచలింగాలకు వెళ్లారు.